క్లుప్తంగా

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



వేసిన డ్రాయింగ్‌తో విద్యార్థులు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు సోమవారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి పీవీ రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో పోటీ తత్వాన్ని పెంపొందేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు.

గార్మెంట్ కార్మికుల మధ్య ఘర్షణ



ఘర్షణ పడుతున్న కార్మికులు

కూర్మన్నపాలెం: యాదవజగ్గరాజుపేటలోని గార్మెంట్‌లో కార్మికుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల మేరకు.. ఉషా గార్మెంట్‌లోకి వేరే గార్మెంట్‌కు సంబంధించిన కార్మికులు మద్యం మత్తులో ఆదివారం రాత్రి చొరబడ్డారు. అక్కడ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న కోళ్ల రాము వారిని ప్రశ్నించడంతో ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో కార్మికులు మద్యంమత్తులో రామ్‌పై దాడి చేశారు. ఆయనకు తీవ్రగాయాలు కావడంతో దువ్వాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గెడ్డల్లో పూడికలు తొలగించండి



87 వ వార్డులో పర్యటిస్తున్న మేయర్ శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం: నగర మేయర్ పీలా శ్రీనివాసరావు సోమవారం 87వ వార్డులో విస్తృతంగా పర్యటించారు. వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రధానంగా నిర్మాణంలో ఉన్న గెడ్డ పనులను వెంటనే పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో గెడ్డలు, కాలువల్లో పూడికలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని సూచించారు. వార్డు కార్పొరేటర్ బొండా జగన్ ప్రజా సమస్యలను మేయర్‌కు వివరించారు. జోనల్ కమిషనర్ శేషాద్రి, వార్డు నాయకులు రామరాజు, వెంకటరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈఈ నాయుడు

అక్కిరెడ్డిపాలెం: ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో భాగంగా సోలార్ రూఫ్ టాప్‌పై విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు సోలార్ రూఫ్ టాప్‌పై అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం ప్లకార్డులు పట్టుకుని గాజువాక ప్రధాన మార్గంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, జూనియర్ ఇంజినీర్లు, ఎలక్ట్రికల్ రెవెన్యూ సిబ్బంది, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండైనా.. వానైనా..



నెల్లిముక్కు జంక్షన్‌లో బస్ షెల్టర్ లేక దుకాణం వద్ద విద్యార్థులు



నడుపూరులో బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

బస్సుల కోసం ఆరుబయటే నిరీక్షణ • కానరాని బస్ షెల్టర్లు

పెదగంట్యాడ: ఎండైనా.. వానైనా.. బస్సుల కోసం నిరీక్షించే వారికి అవస్థలు తప్పడం లేదు.. బస్ షెల్టర్లు లేకపోవడంతో రోడ్డుపైనే వేచి ఉండాల్సిందే.. అయినా బస్సులు సమయానికి రాకుండా పరీక్ష పెడుతున్నాయి. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు, వృద్ధులు, పిల్లలు, దివ్యాంగులు మండే వేసవైనా.. ముసురైనా బస్సుల కోసం రోడ్డుపైనే నిలవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రధాన జంక్షన్లలో బస్సు షెల్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమంటూ అధికారులు ప్రచారంతో హోరెత్తిస్తున్నా.. ప్రయాణికులు వేచి ఉండేందుకు అవసరమైన బస్ షెల్టర్ల నిర్మాణంపై దృష్టి పెట్టడం లేదు. ఫలితంగా మహిళలు, విద్యార్థులు, చిన్నారులు, వివిధ వర్గాల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి మండలంలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నారు. మండలంలోని ప్రధాన జంక్షన్లయిన నడుపూరు గాంధీపార్కు, హౌసింగ్ బోర్డు కాలనీ, బర్మా కాలనీ, నెల్లిముక్కు, పెదగంట్యాడ, దయాల్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎక్కడా బస్ షెల్టర్ కానరావడం లేదు.

వందలాది మంది ప్రయాణిస్తున్నా..

ఈ ప్రాంతాల నుంచి ప్రతి రోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఆర్టీసీ బస్సుల్లోనే రాకపోకలు సాగిస్తుంటారు. వాటి కోసం ప్రధాన కూడళ్ల వద్ద వేచి ఉంటారు. అయితే అక్కడ వారు వేచి ఉండేందుకు అనువుగా బస్ షెల్టర్లు నిర్మించకపోవడంతో రోడ్లపైనో, చెట్ల కింద నిరీక్షిస్తున్నారు. బస్సుల కోసం వేచి ఉండే ప్రాంతాల్లో ఎలాంటి సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు, వృద్ధులు ఎండలో నిలబడడంతో ఒక్కోసారి స్పృహ తప్పి పడిపోయిన సంఘటనలు కోకొల్లలు. ఒక పక్క వేసవి ఉష్ణోగ్రత, మరోపక్క వర్షాల కారణంగా రోడ్లపై నిలబడలేక భయభ్రాంతులకు లోనవుతున్నారు. బస్సు షెల్టర్లు లేకపోవడంతో అక్కడ ఉన్న దుకాణాల వద్ద, చెట్ల నీడలో ఉంటూ బస్సులు రాగానే అక్కడి నుంచి పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొని ఉంది. ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సదుపాయాలు కల్పించడంలో విఫలమవుతున్నారని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు నిలిపే నడుపూరు గాంధీపార్కు, పెదగంట్యాడ పీహెచ్‌సీ ఎదురుగా, నెల్లిముక్కు జంక్షన్‌లో బసు షెల్టర్లు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దాతల సహకారంతోనైనా బస్ షెల్టర్లు నిర్మించి నీడ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



ప్రతి రోజూ నేను నగరానికి రాకపోకలు సాగిస్తుంటాను. నెల్లిముక్కు జంక్షన్‌లో బస్సు కోసం వేచి చూస్తుంటాను. అయితే అక్కడ కనీసం **కూర్చుకో**వడానికి కూడా **సౌకర్యం** లేదు. బస్సు షెల్టర్ **లేకపోవడంతో ఎండలోనే** నిరీక్షించాల్సి **వస్తోంది. ఇప్పటికైనా అధికారు**లు స్పందించి **బస్ షెల్టర్లు నిర్మించాలి.**

– **బొట్ట శ్రీనివాస్‌రెడ్డి,** ప్రయాణికుడు

రోడ్డుపైనే నిరీక్షణ



నేను ప్రతి రోజూ కాలేజీకి బస్సులోనే **వెళ్తుంటా**ను.. బస్సు వచ్చే **సమయా**నికి ముందే బస్సు **ఆగే** ప్రాంతానికి చేరుకుంటాను. **అయితే** బస్సు కోసం **రోడ్డుపైనే** నిలబడాల్సి వస్తోంది. **ఎండ**లో ఉండడం వల్ల **ఒక్కోసారి** నీరసం వస్తోంది. **అధికారులు స్పందించి బస్** షెల్టర్ నిర్మిస్తే **వేచి ఉండేందుకు ఇబ్బందులు** ఉండవు.

– **గొందేశి భరత్** కుమార్ రెడ్డి, విద్యార్థి

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి

గాజువాక: కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 4న నిర్వహించనున్న వెన్నుపోటు దినం పోస్టర్‌ను ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ఆవిష్కరించారు. 66వ వార్డులో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్టీ రామారావుకు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని కైవసం చేసుకున్న చంద్రబాబు ఇప్పుడు హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. దీనికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించనున్న వెన్నుపోటు దినం కూటమి ప్రభుత్వానికి గుండెపోటు దినం అవుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, దుబాయ్ బాషా, పెదిరెడ్ల ఈశ్వరరావు, పేరం రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని పాఠశాలల్లో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం

అగనంపూడి: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5న అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ శిష్టు ఖగేశ్వరరావు చెప్పారు. మొక్కలు నాటడం, అవగాహన ర్యాలీలు నిర్వహించాలని ఆయన కోరారు. జీపీఎస్ మోడ్‌లో కార్యక్రమాల వివరాలు ఏపీఎన్‌జీసీ అనకాపల్లి గ్రూప్‌లో షేర్ చేయాలని కోరారు. హెచ్‌ఎం రొతు నాగేశ్వరరావు, కో ఆర్డినేటర్ అన్నాజీరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి



సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పెద నడుపూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్య స్వామి సహిత నూకాంబిక విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, ప్రతినిధులు నాగేశ్వరరావు, వెంకటరావు, బెల్లాల పెంటబాబు ఆధ్వర్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. ఆధ్యాత్మిక చింతనఅవసరమన్నారు. కార్యక్రమంలో గాజువాక ఆర్యవైశ్య ప్రతినిధులు కేసారపు శ్రీను, రమేష్, నంబూరి జగన్నాథం, నాయకులు కులుకూరి మంగరాజు, బచ్చు అప్పలరాజు, రొతు గోవింద్, కడిమిశెట్టి వరప్రసాద్, కులుకూరి శ్రీనివాసరావు, పట్నాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్లానింగ్ సెక్రటరీ అత్యుత్సాహం!

- నిర్మాణంలో ఉన్న గోడ కూల్చివేత
- పోలీస్ స్టేషన్‌కు చేరిన వివాదం



సంఘటన వద్ద ఘర్షణ పడుతున్న ప్లానింగ్ సెక్రటరీ తదితరులు



వివాదానికి కారణమైన కూల్చివేసిన గోడ

కూర్మన్నపాలెం: ప్లానింగ్ సెక్రటరీ అత్యుత్సాహం వివాదానికి దారితీసింది. అక్రమకట్టడాలపై వారి చర్యలు విడ్డూరంగా ఉంటున్నాయి. కాసులు కురిపించేచోట ఒకలాగ.. లేని చోట మరోలా వారు నిబంధనలు అమలు చేస్తుండడంతో ప్రజల నుంచి తిరుగుబాటు ఎదురవుతోంది. ఇందుకు సోమవారం మంగళపాలెం జేఎన్ఎం కాలనీలోని జరిగిన సంఘటనే నిదర్శనంగా నిలుస్తుంది. అక్కడి ప్లానింగ్ సెక్రటరీ చేసిన పని వల్ల వివాదం తలెత్తింది. అది చివరకు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో అక్కడ పంచాయతీ నడుస్తోంది.

ఇదీ పరిస్థితి : గాజువాక శివారులోని మంగళపాలెంలో వివిధ పథకాల కింద ఇళ్లు మంజూరు చేసిన వారు నివాసం ఉంటున్నారు. ఆయా ప్రజలు తమకు అనుకూలంగా ఇంటికి చేర్పులు మార్పులు చేసుకుంటున్నారు. అయితే రాజేష్ అనే వ్యక్తి సాయి బాబా గుడికి సమీపంలోని ఉంటున్న బ్లాక్‌లో తన ఇంటి ముందు గోడ నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై అదే బ్లాక్‌లో నివసిస్తున్న వినయ్ అనే వ్యక్తి సమాచారం అందించడంతో ప్లానింగ్ సెక్రటరీ వెళ్లి గోడను కూల్చేశారు. ఇంటి ఎదురుగా మరో నిర్మాణం జరుగుతున్నా దాన్ని పట్టించుకోకుండా అడిగిన సొమ్ము ఇవ్వలేదని గోడ కూల్చేశారని ఇంటి యజమాని ఆరోపిస్తూ వాదనకు దిగింది. ఈ ఘర్షన జరుగుతుండగా 100కి సమాచారం అందించడంతో దువ్వాడ పోలీసులు రంగలోకి దిగారు. ప్లానింగ్‌సెక్రటరీతోపాటు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ వేడుక



పూర్వ ఉపాధ్యాయులతో 1997 బ్యాచ్ విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: మింది జెడ్పీ హై స్కూల్ 1997 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక మిందిలోని గుడివాడ అప్పన్న కల్యాణ మండపంలో సోమవారం జరిగింది. మింది హై స్కూల్ విశ్రాంత ఉపాధ్యాయులు ఈటి గోవిందరావు, మింది ఎలిమెంటరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జగన్నాథం, అప్పటి హైస్కూల్ ఉపాధ్యాయులు అప్పలరాజు, రమణమూర్తి, సోమయాజులు, వరణాచలంను ఘనంగా సన్మానించారు. విద్యార్థి దశలో చేసిన అల్లరి.. చిలిపి పనులను నెమరు వేసుకుని వారంతా ఉత్సాహంగా గడిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏడీసీపీ మోహనరావు

అక్కిరెడ్డిపాలెం: ఇంట్లో కిటికీ పక్కన పడుకున్న వృద్ధురాలి మెడలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడి ఇద్దరి పోలీసులు అరెస్ట్ చేశారు. సంఘటనపై క్రైం ఏడీసీపీ మోహనరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అజీమాబాద్, నవాబ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఉరుకూటి నూకాలమ్మ (60) గత నెల 27న ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. 26 రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులు యథావిధిగా నిద్రించగా నూకాలమ్మ ప్రధానహాలులో తలుపులు వేసుకుని నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి కిటికీ దగ్గరకు వచ్చి ఆమె మెడలో ఉన్న రెండు పేటల బంగారు గొలుసు లాక్కొని పారిపోయాడు. దీంతో ఆమెకు మెలకువ వచ్చి బిగ్గరగా కేకలు వేయగా కుమారుడు సన్యాసిరావు తలుపులు తీసుకుని బయటకు వచ్చి చూడగా పల్సర్ బైక్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు పారిపోవడాన్ని చూసి పట్టుకునేందుకు ప్రయత్నించినా అక్కడ నుంచి పరారయ్యారు. గాజువాక పోలీస్ స్టేషన్‌లో స్నాచింగ్ కేసు నమోదు కావడంతో క్రైం డీసీపీ కె.లతా మాధురి, ఏడీసీపీ మోహనరావు పర్యవేక్షణలో క్రైం ఏసీపీ జోన్ 2 డి.లక్ష్మణరావు, సౌత్ సబ్ డివిజన్ క్రైం కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐ మన్మథరావు ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ఆధారాలు సేకించారు. ఆదివారం రాత్రి 8 గంటలకు సరస్వతీ స్కూల్ దగ్గరలోని పైడిమాంబ కాలనీ గాజువాకకు చెందిన చేపల ఆనంద్‌తో పాటు కంబాల శ్రీరాజు అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి రెండు పేటల బంగారు గొలుసుతో పాటు పల్సర్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు నేరస్తులపై కేసులతో పాటు సస్పెక్ట్ షీట్స్ ఉన్నట్టు వెల్లడించారు.

వ్యక్తి ఆత్మహత్య



చెట్టుకు వేలాడుతున్న ఉరిపోసుకున్న వ్యక్తి

కూర్మన్నపాలెం: గ్రీన్‌సిటీకి సమీపంలో చెట్టుకు ఉరిపోసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి దువ్వాడ పోలీసులు అందించిన వివరాలివీ.. గుర్తు తెలియని వ్యక్తి 88 వార్డు గ్రీన్‌సిటీ వెలుపల చెట్టుకు ఉరిపోసుకొని మృతిచెందాడు. ఆత్మహత్యపై కేసు నమోదుచేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు.

స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం మధుసూదనరావుకు సత్కారం



నూతన విభాగాధిపతిని అభినందిస్తున్న స్టీల్‌క్లబ్ పాలకవర్గం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ (ఇన్‌చార్జి) ఎం. మధుసూదనరావును స్టీల్‌క్లబ్ పాలకవర్గం సత్కరించింది. హెచ్‌ఆర్ విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం పాలకవర్గ ప్రతినిధులు ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. స్టీల్‌క్లబ్ కార్యక్రమాలను వివరించారు. మధుసూదనరావు మాట్లాడుతూ ప్లాంట్ అభివృద్ధికి ఉద్యోగులంతా అంకిత భావంతో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పెంటకోట రామకృష్ణ, కోశాధికారి డి. వేణుగోపాల్, సంయుక్త కార్యదర్శి వై.రవి కుమార్, కార్యవర్గ సభ్యులు జె.రమేష్, వి.ఎన్. బి. రాజు, ఎం.భువన కిరణ్, ఎం.రంగనాథం, బి.వి. రమణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ఆర్చి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో ఓ వ్యక్తి పడిఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో దువ్వాడ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఆ వ్యక్తి వయసు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని ఆయన కోరారు.

పేదలకు స్థలాలివ్వాలని ధర్నా



ధర్నాలో పాల్గొన్న సీపీఐ నాయకులు

గాజువాక: పట్టణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు రెండు సెంట్ల చొప్పున నివాస స్థలాలివ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గాజువాక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలాలు, గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్ల స్థలాలు ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని నిలబెట్టుకోలేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను కూడా అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. ప్రజలకిచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గాజువాక డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కె.వనజాక్షి, జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పిల్లా పద్మ, పెదపూడి దుర్గారావు, పల్లేటి పోలయ్య, చంద్రశేఖర్, శివ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సడలని సంకల్పం

- పిల్లలు, వృద్ధుల భాగస్వామ్యం
- 34వ రోజు కొనసాగిన మినరల్ వాటర్ బాటిళ్ల పంపిణీ



మినరల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న చిన్నారులు

అగనంపూడి: దూర ప్రాంతాల నుంచి రైలు ప్రయాణం చేసే వారికి దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కూలింగ్ వాటర్ బాటిళ్ల పంపిణీ కార్యక్రమం 34వ రోజు కొనసాగింది. స్వచ్ఛంద సంస్థలు గత నెల 30న ప్రారంభించిన కార్యక్రమం నిరాటంకంగా కొనసాగుతోంది. రోజుకు 200 నుంచి 250 బాటిళ్ల వరకు సాధారణ, మహిళా, దివ్యాంగుల బోగీల్లోని ప్రయాణికులకు అందిస్తున్నారు. దువ్వాడ రైల్వే స్టేషన్ అధికారులు, ఆర్పీఎఫ్ సిబ్బంది సహకారంతో చేపట్టిన కార్యక్రమంలో ఎంఎస్ఎన్ మూర్తి, కంచుమూర్తి ఈశ్వర్, వి.జాషువ, కామేశ్వరరావు, బుచ్చిరాజు, పి.శ్రీనివాస్, ఆదిల్ రెహ్మాన్, భాస్కరరాజు, నాగేశ్వరరావు, బాలలు హిమజా, సాహితి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె



విద్యుత్ కాంతుల్లో తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం

అక్కిరెడ్డిపాలెం: శీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో వారి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలకు దివ్యక్షేత్రం సర్వం సిద్ధమైంది. రంగురంగుల విద్యుత్ దీపాలతో దివ్యక్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ కాంతులతో ఎస్టీబీఎల్ పరిసరాలన్నీ వెలుగులు విరజిమ్మాయి. మంగళవారం నుంచి 7వ తేదీ వరకు విశేష పూజలతో బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

అంతర్జాతీయ క్రీడలకు వేదిక గాజువాక



మాట్లాడుతున్న ఎంపీ భరత్

పెదగంట్యాడ: అంతర్జాతీయ క్రీడలకు వేదికగా గాజువాకను తీర్చిదిద్దుతామని విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎం. భరత్ అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు పరిధి వికాష్‌నగర్‌లో రూ.9 కోట్ల వ్యయంతో ఆధునికీకరించిన ఇండోర్ స్టేడియం, ఈత కొలను,ఓపెన్ ఆడిటోరియంను స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, నగర మేయర్ పీలా శ్రీనివాస్‌లతో కలసి సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగరంలో గాజువాకకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. క్రీడాకారులకు అనువైన వేదికగా ఈ ఇండోర్ స్టేడియం నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు, గండి బాబ్జీ, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరెడ్డి, నాయకులు ప్రసాదుల శ్రీనివాసరావు, పలువురు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కూర్మన్నపాలెం: రాజీవ్‌నగర్‌లో నిర్వహిస్తున్న మజ్జిగ చలివేంద్రాన్ని సోమవారంఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.వెంకటరావు, నాగేశ్వరరావు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ





షాలినీని, తరుణ్ సాయిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

ఉక్కునగరం: ఐఐటీ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో గాజువాక జోన్ శ్రీచైతన్య విద్యార్థులు విజయదుందుభి మోగించారని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం రమణ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ఫలితాల్లో చెరుకూరి షాలినీ చౌదరి 275 ర్యాంకు, దేపూరు జ్ఞాన దీప్ 295 ర్యాంకు, పాలవలస తరుణ్ సాయికి 352 ర్యాంకు లభించింది. అదే విధంగా మొత్తం వెయ్యి లోపు ర్యాంకులు ఆరుగురు, 10 వేల లోపు ర్యాంకులు 35 మంది సాధించారని తెలిపారు. ర్యాంకర్లను రమణ, ఎగ్జిక్యూటివ్ డీన్లు ఎస్. రఘుకుమార్, కె.బంగారు బాబు, ఏజీఎం పి. శ్రీనివాసరావు అభినందించారు.